

# అమ్మాజీ



**నల్లల వెంకటేశ్వరరావు**

**(గత సంచిక తరువాయి)**

నేను ఆమె కూడా వెళ్లాను.

ఊరికి చివరగా ఉందా ఇల్లు. ఓ పాకలా వున్న తాటాకు ఇల్లది. ఇంట్లో యింకెవరూ కనిపించ లేదు.

అరుగు మీద చాప వేసి కూర్చోమంది.

కూర్చుని "కొంచెం మంచినీళ్లు ఇప్పించండి" అనడిగాను.

"తెస్తాను. ఇదుగో ఈ వెంట్రుకలు చూడు" అని యింత ముద్దలా వున్న వెంట్రుకల్ని చూర్లోది తీసి ఇచ్చింది.

మంచినీళ్లు తాగి "ఎవరికండి సవరం?" అన డిగాను.

"మా వదినకి. కట్టించమని మా ఇంటి కొచ్చి నప్పుడు ఈ వెంట్రుకలు యిచ్చి వెళ్లిం ది. వాళ్లూరికి సవరాలు కట్టేవారు రారట..." అంది.

బేరం కుదుర్చుకుని పని మొదలుపెట్టాను.

"ఏ వూరు మీది?" అనడిగింది, నా ఎదురుగా కూర్చుని.

"చింతలపూడండి."

"మొదట్నించి ఇదే పనా?" నీ వృత్తి పూర్వం నుండి ఇది కాదన్నట్టుగా ఉందామె ప్రశ్న.

"లేదండి, చాలా పనులు చేశాను. దేనిలోనూ యిమడలేక, ఏం చెయ్యాలో తెలీక, అప్పుడ ప్పుడూ ఇలా బయల్దేరతాను."

"నీకు పెళ్లయిందా?" అవ్వలేదు 'పందెం' అన్నట్లుంది.

"లేదండి. వొంటి వాణ్ని."

"మరి పెళ్లి చేసుకోక పోయా వా? నీకు కాచి పోయటానికి తోడుగా ఓ మనిషి ఉండేది."

"ఈ సవరాలు కడతా పెళ్లి చేసుకోవ డం ఇష్టం లేదండి. ఏదైనా మంచి వ్యాపారం చూసుకుని... అయినా నాకు పిల్ల నిచ్చేది ఎవరండి?" అన్నాను నవ్వుతూ.

చాలామంది ఆడవాళ్లు ఇలానే వివరాలు అడిగి తెలుసుకుంటూ ఉంటారు. నేనేమో దాపరికం లేకుండా చెప్పే స్తాను. కొంత మంది వయస్సు మళ్లినవాళ్లు అయితే నన్ను ఆట పట్టించినట్లు "నన్ను పెళ్లి చేసుకోరా దూ. వండి పెడతాను" అని నవ్విస్తూ ఉంటారు. నేనూ నవ్వేసి వూరుకుంటాను.

కానీ, అమ్మాజీ అడగడంలో ఏదో కొత్తదనం కనిపించింది నాకు, జడకి సవరం కొత్తలాగ.

"ఏం, నీకేం తక్కువ? డబ్బు లేనంత మాత్రాన మనుషులకి విలువ లేదా ఏమిటి?" అంది.

నేనేమీ మాట్లాడలేదు. ఇంతలో వాళ్ల అమ్మను కుంటా, వచ్చింది. ఆమె కూడ విధవరాలే.

"చూడయ్యా! కుప్పులు విడిపోతాయి. గట్టిగా కట్టాలి. ఇదివరకు గవరయ్య అనే ఓ అతను వచ్చే వాడు. అతను సవరం కడితే ఏళ్ల తరబడి చూడ క్కర్లేదు" అని గలగల మాట్లాడి లోనికి పోయింది.

వెనకాలే కూతురు వెళ్లి, ఓ అయిదు నిమిషాల్లో తిరిగొచ్చింది.

సవరం కట్టేసరికి చీకటి పడింది. ఇప్పుడు పది మైళ్లు నడిచి వెళ్లడం జరగదు.

"డబ్బొద్దు గాని అన్నం పెట్టండి. ఈ రాత్రి ఎక్కడన్నా గడిపి, తెల్లారి వెళ్లిపోతాను" అన్నాను.

ఆమె కొంచెం ఆలోచించినట్లుగా కాసేపు ఆగి "డబ్బు తీసుకో, పర్వాలేదు. అన్నందేముంది, తిందువులే" అంది.

***

అన్నం తింటుండగా, "ఈ అరుగు మీద పడుకో. పర్వాలే"దంది.

అదే చాప మీద కూర్చున్నాను అన్నం తిని. సిగ రెట్ వుంటే వెలిగించుకొని గట్టిగా ఓ దమ్ము గుండెల్నిండా పీల్చుకున్నాను. ప్రాణం గాల్లో తేలుతున్నట్లుగా ఉంది.

వెల్లకిలా పడుకున్నాను. వెన్నెల జాలిగా నా వంక చూస్తోంది, ఏమైనా చెప్పమన్నట్లు. వెన్నెట్లో చెట్లు నగ్నసుందరుల్లా తడుస్తున్నాయి.

ఇంట్లో నుంచి సన్నగా ఏవో మాటలు వినపడు తున్నాయి. తర్వాత క్రమంగా నిశ్శబ్దం ఆవరిం చింది.

కుక్కలు దూరంగా మొరుగుతున్నాయి.

దగ్గరలో ఎక్కడో నీళ్ల చప్పుడు అవుతోంది. ఎవరో స్నానం చేస్తు న్నారు. గాజులు గలగల మని శబ్దం వింతగా అల్ల రిగా వినిపిస్తోంది. క్రమంగా అది మాయమైంది.

కొద్ది సేపు అలానే కూర్చుని లేచి, దడి వారగా వెళ్లి ఒంటేలు పోసుకొని తిరిగి వస్తూ, అప్రయ త్నంగా అటుగా చూశాను.

ఆమె ఇంట్లో, తన గదిలో, నగ్నంగా, కిరసనా యిల్ లైట్ వెలుతురులో వొళ్లు తుడుచుకుంటూ కనిపించింది. నా కాళ్లు భూమిలో పాతేసినట్టు ఆగిపోయాయి. గబాల్న తప్పుకోవాలని ఉంది. ఈ లోపు ఆమె చూస్తుందేమో అని భయంగానూ ఉంది.

ఇంతలో ఆమె చూడనే చూసింది నన్ను.

నేను ఇటు ఒక దూకు దూకి చాప మీద పడ్డాను. నా గుండెలు పీచుపీచుమంటూ కొట్టు కుంటున్నాయి. ఇంత వరకూ నేను ఏ అమ్మా యినీ అలా చూడలేదు. కనీసం ముట్టుకోలేదు కూడా. ఇరవై ఏళ్లు దాటినా నేను భయం వల్ల ఎవరి జోలికీ పోలేదు.

పల్లెటూరు కావడం వల్ల సందకాడే నిశ్శబ్దమై పోయింది వూరు. ఏవో పిట్టల అరుపులు, కీచు రాళ్ల మోత తప్ప అంతా నిశ్శబ్దం.

నాకు ఎంతకీ నిద్ర పట్టలేదు. ఆ దృశ్యమే పదేపదే కళ్ల ముందు కనిపిస్తోంది. నోరు ఆర్చుకు పోయింది. మంచినీళ్లు తాగాలి. పిలవాలంటే మాట రాదు. కాసేపు అలా గడిచిన తర్వాత, గుమ్మం దగ్గర నుంచుని తొంగి చూశాను.

ఏ అలికిడీ లేదు. అంతా ప్రశాంతం.

వరసగా మూడు గదుల పాక అంది. మధ్య గ దిలోకి వచ్చి నుంచున్నాను. అడుగుల చప్పుడు కాకుండా ఇటుగా వున్న గదిలోకి తొంగి చూశాను. ఓ నులక మంచం. దండెం మీద పాత బట్టలు తప్ప ఏం లేవు.

మంచినీళ్ల బిందె గాని కనిపిస్తుందేమో మెల్లిగా తాగి వెళ్లి పడుకుందాం అని నా తాపత్రయం. కానీ అదే కనిపించడం లేదు. అటు పక్క గదిలోకి తొంగి చూశాను. వంటగదిలా ఉంది. బిందెలు, సామాను కనిపించాయి. ఓ మూలగా నవారు మంచం మీద ఆమె పడుకొని ఉంది. ఏమి చెయ్యాలో పాలుపోలేదు. వెనక్కి వెళ్లిపోదామా అని క్షణం అనిపించింది కాని... దాహం...

కాళ్లు గోడకి తన్ని పెట్టడం వల్ల మోకాళ్ల వరకు చీరె తొలగి ఉంది. గోడకి తగిలించి వున్న గుడ్డి లైట్ వెల్తురులో స్పష్టంగానే కనిపించింది ఆమె. వాళ్ల అమ్మ ఏమైనట్టు?

ఏమీ ఎరగనట్టు రెండు అడుగులు వెనక్కి వేసి, గొంతు సవరించుకుని, "కొంచెం మంచినీళ్లిప్పిస్తారా?" అన్నాను. ఈ మాట అనటానికి నా నరాలు తెగాయి అంటే నమ్మండి!

కొద్ది సేపటికి "యిటొచ్చి ముంచుకో" అని వినిపించింది.

నాలో వణుకు వొళ్లంతా పాకినట్టయింది. చలి జ్వరం వచ్చిన వాడిలా వణికి పోతున్నాను.

నెమ్మదిగా లోనికెళ్లాను. ఆమె అలానే పడుకుని ఉంది. ఎదురుగా బిందె, దాని మీద గ్లాసు కనిపించాయి. తొందర తొందరగా రెండు గ్లాసులు ముంచుకు తాగాను. ఓ పట్టాన గొంతు దిగలేదు నీళ్లు.

నా అవస్థ అంతా గమనిస్తున్నట్టే కనిపించింది ఆమె నాకు.

"ఓ గ్లాసు ఇటు" అంది, మంచం మీద అదోలా కూర్చుని. నీళ్ల గ్లాసు అందించాను. నీళ్లు తాగి గ్లాసు ఇస్తూ అమాంతంగా నన్ను ఆమె మీదకి లాక్కుంది.

***

రెండు గంటల తర్వాత కుప్పులు జారిన సవరంలా వచ్చి చాప మీద వాలేను.

ఆమె మంచం మీద అలానే వివస్త్ర అయినట్లు, శరీరమంతా ఆత్మలోకి ఇంకిపోయినట్టుగా, మంచం మీద ఉండిపోయింది.

"నీతో వచ్చేస్తాను, తీసుకెళ్తావా?" అనడిగింది; చాప మీద వున్న నా దగ్గరకొచ్చి.

"ఎలా పెంచను?" అన్నాను ఏమనాలో తెలీక.

"నా దగ్గర రెండు వేల దాక విలువ గల బంగారం ఉంది. అది అమ్మి ఏదైనా వ్యాపారం చెయ్యి."

"మీ వాళ్లు నీ గురించి వెతకరా?"

"వెతికినట్లే వుంటారు, వెతకరు" అంది. మళ్లీ తనే లేచి, "ఏ విషయం ఓ అరగంటలో చెప్పాలి. మళ్లీ మా అమ్మ వస్తుంది."

తర్వాత చాలా సేపు చుక్కల్ని చంద్రుడిని చూస్తూ ఆలోచించాను. సగం రాత్రి దాటిపోయి వుంటుంది. ఓ నిర్ణయానికి వచ్చాను. అంతే! అమ్మాజీని తీసుకొని ఏకాయెకిని రాజమండ్రి వచ్చేశాను.

ఒక రోజంతా రైల్వే స్టేషన్‌లో గడిపాము.

అమ్మాజీని స్టేషన్‌లోనే ఉంచి పగలంతా తిరిగి, సాయంత్రానికి ఓ తాటాకు ఇల్లు 20 రూపాయలకి అద్దెకి తీసుకున్నాను. ఆ రాత్రి నేను తీసుకొచ్చిన సామానుతో అమ్మాజీని తీసుకుని ఆ ఇంట్లో ప్రవేశించాం.

"ఏం వ్యాపారం పెడదాం?" అనడిగాను ఆ రాత్రి.

"నాకు హోటల్ పని వచ్చు. ఎక్కడైనా సెంటర్ చూసి పెడదాం" అని సలహా ఇచ్చింది. వాళ్ల నాన్న బతికుండగా వాళ్లది హోటలేనట.

మర్నాడు బొమ్మూరు మెట్ట తిరిగి చూశాను. జాడీల కంపెనీలు ఎక్కువగా ఉన్నాయక్కడ. ఇక్కడే రోడ్ పక్కగా ఓ పాక వేసి హోటల్ పెడితే బావుండదా? అని ఆలోచించాను. అక్కడికి దగ్గరలో హోటల్స్ లేవు. అమ్మాజీని తీసుకొచ్చి సాయంత్రం చూపించాను.

అమ్మాజీ అంతా తిరిగి చూసి, "బావుంటుంది" అని చెప్పింది.

నాలుగు రోజుల్లో పాక వేశాము.

ఏమేమి గిన్నెలు కొనాలో లిస్ట్ రాసిచ్చింది అమ్మాజీ.

అన్ని తెచ్చి మంచి రోజు చూసి హోటల్ ప్రారంభించాం.

అమ్మాజీ వేషం పూర్తిగా మార్చేసింది. బొట్టు పెట్టుకోవడంతో ఆమె ముఖానికి నిండుతనం వచ్చింది. ఒక రోజు గుడికి తీసుకెళ్లి నా చేత్తో పసుపు తాడు కట్టించుకుంది. ఆమె కళ్లు చాలా తృప్తిగా, గర్వంగా కదిలాయా క్షణంలో. ఆమె కళ్లు ఎందుకో నీటితో కూడా నిండి ఉన్నాయాక్షణం.

ఉదయం ఇడ్లీలు పది గంటల వరకూ



ఉండేవి. అప్పట్నించి పకోడీ లేదా గారో, వడో ఏదో ఒకటి వేసేవాళ్లం. టీ మాత్రం పొద్దున్నుంచి సాయంత్రం వరకు ఉండేది.

మేం ఉండటం కూడా హోటల్ వెనక ఓ గది లాంటి దాంట్లోనే కావడం వల్ల, ఏమీ ఇబ్బంది అనిపించేది కాదు.

అంతా బాగానే ఉంది. కానీ, అలసిన శరీరం ఏ పది గంటల రాత్రికో పక్క మీద వాలేసరికి, అమ్మాజీ ఆవురావురుమంటూ దగ్గరికి చేరేది. నాకు మండుకొచ్చేది.

"నువ్వే రాక్షసివో అయి ఉండాల్సింది. హోటల్ లేకపోతే పగలు కూడా చంపుతావేంటి?" అని విసుక్కునేవాడిని.

అయినా ఆమె నవ్వుతూ దగ్గరకి జరిగి "లోకమంతా దీని గురించే గదా బతికేది? మరీ అంత తీసిపారెయ్యకు. నాకు కాస్త ఎక్కువే పోసేడేమో దేవుడు ఏం చెయ్యను?"

నాకు చాలా బాధనిపించింది. దగ్గరకి తీసుకునేవాడిని.

ఇలా రెండు సంవత్సరాలు గడిచాయి. ఇద్దరమల్లా ముగ్గురం, ముగ్గురమల్లా నలుగురం అయ్యాం.

ఇప్పుడెప్పుడన్నా దగ్గరికి చేరితే, "నన్ను చంపకు. పడుకోనియ్యి" అని పిల్లల్ని దగ్గరకి తీసుకుని అటు తిరిగి పడుకుంటుంది.

ఆమె కాళ్ల దగ్గరే అలానే కూర్చుని, "పగలంతా చాకిరీ మరీ ఎక్కువగా ఉంది. రేపట్నుండి నువ్వు చెయ్యకు. కాళ్లు పిసకనా?" అంటూ కాళ్ల మీద చెయ్యి వేసీ వెయ్యగానే, దబ్బున తన కాళ్లు లాక్కుని, "ఉ... పట్టావంటే వదలవు గదా!" అని నా మంచం మీదకి వచ్చి పడుకునేది.

ఆడది రానంటే మగాడికి కోర్కె ఎక్కువ రేగుతుంది. అదే ఆమె రమ్మంటే వెనక్కి జారుకుంటాడు.

***

తాటాకు పాకల్లా పోయి రేకుల షెడ్ వేసుకున్నాం. మూడో కాన్పు అమ్మాయి పుట్టేసరికి, హోటల్ వెనుక ఓ మూడు వందల గజాల స్థలం కొని, ఉండటానికి ఇల్లు వేసే ప్రయత్నంలో ఉన్నాం.

అప్పుడే అనుకుంటా... ఎవరో అమ్మాజీ బంధువు ఒకడు వచ్చాడు. ఇక్కడ వాతావరణం అంతా చూసి ఏం మాట్లాడకుండా రెండు రోజులుండి, వెళ్లిపోయాడు. తర్వాత కొన్ని రోజులకి అమ్మాజీ తల్లి వచ్చింది

"ఈ ముసిల్ది నీకు భారమైందే అమ్మా?" అనుకుంటూ. మనవలిద్దర్నీ ముద్దులాడి, మనవరాల్ని వళ్లో కూర్చోపెట్టుకుని "ఇదిగో అమ్మా! ఈ ముసిల్దానికి రూపాయలతో యిహ పని తీరిపోయింది. ఉన్న ఇల్లు, వాకిలి అమ్మి తెచ్చాను. ఈ డబ్బునే పేర్న బ్యాంకులో వేసుకో, నీ పెళ్లి నే చూడకపోయినా, డబ్బిచ్చానన్న తృప్తి అయినా మిగుల్తుంది" అంటూ కన్నీళ్లెట్టుకుని. పాత చీరె గుడ్డలో చుట్టిన డబ్బు తీసి మనవరాలి చేతిలో పెట్టింది.

మనవరాలు తీసుకెళ్లి అమ్మ చేతిలో పెట్టింది

"ఇప్పుడవన్నీ ఎందుకు లెండి?" అంటూ నసిగాను.

అమ్మాజీ నా వంక చూసి కళ్లెర్రజేసింది. ఇహ నేనక్కడుండటం మంచిది కాదన్జెప్పి బయటకొచ్చేశాను.

మర్నాడు, తల్లి ఇచ్చిన డబ్బు కూతురు పేర్న కొంత బ్యాంకులో వేసి, కొంత కట్టుకుంటున్న ఇంటికి వాడింది.

అమ్మాజీ తల్లి అంత వయసు మళ్లిన మనిషేం కాదు. పనీ, పాటూ బాగానే చేస్తుంది. అమ్మాజీకి సగం పని తగ్గింది, తల్లి వచ్చాక. ఆ మాటకొస్తే నాకు కూడా కొంత పని భారం తగ్గింది. చచ్చే పని చేస్తుంది. మరి ఆ ఓపిక ఎక్కడ నుంచి వస్తోందో నాకే ఆశ్చర్యంగా ఉంటుంది. మొత్తానికి రాయిలాంటి మనిషి. రోజుకి ఏభై రూపాయలు ఇచ్చినా అలాంటి మనిషి దొరకని సమయం.

(ఈ కథ నిజంగా జరిగిందే. 1968లో అనుకుంటా, అమ్మాజీ కథ ప్రారంభమైంది. అంటే 37 ఏళ్ల క్రితం అన్నమాట. ఈ రోజున ఆ సవరాలు కట్టే అతనే ఇంచుమించు 30 లక్షల ఆస్తి పరుడయ్యాడు. బొమ్మూరు మెట్ట మీద ఈ రోజుకీ అతను దేదీప్యమానంగా వెలుగుతున్నాడు)

ఎవరైనా ఈ విషయం కదిపితే, "అంతా అమ్మాజీ చలవే! నాదేం ఉంది?" అంటాడతను.